గులాబీమయమైన ఖైరతాబాద్



- నామినేషన్ రోజు సత్తా చాటిన బీఆర్ఎస్ అభ్యర్థి దానం
- ప్రముఖులతో కలిసి నామినేషన్ కేంద్రం వరకు ర్యాలీ

గిరిజన మహిళల నృత్యాలు... యువతీయువకుల ఆటపాటలు... కార్యకర్తల కేరింతలు, జిందాబాద్ నినాదాల నడుమ ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఖైరతాబాద్‌లోని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో బుధవారం ఆయన తన నామినేషన్‌ను దాఖలు చేశారు.



దానం నాగేందర్‌తో కలిసి ర్యాలీలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



గులాబీ శ్రేణులతో సందడిగా మారిన ఖైరతాబాద్ బడా గణేష్ ప్రాంతం

ఖైరతాబాద్: నామినేషన్ దాఖలు ముందు దానం నాగేందర్ రాజ్‌దూత్ చౌరస్తా నుంచి వేలాది మంది గులాబీ శ్రేణుల వెంట రాగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ప్రభాకర్ కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, సంగీతాయాదవ్, మహాలక్ష్మి రామన్‌గౌడ్, వెల్దండ వెంకటేష్, బీఆర్ఎస్ సీనియర్ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, మామిడి నర్సింగ్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్నారాంమూర్తితో, మాజీ కార్పొరేటర్లు, హేమలతా యాదవ్, భారతినాయక్, కాజా సూర్య నారాయణ, కలిసి ఖైరతాబాద్ బడా గణేష్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

- ఖైరతాబాద్ మహంకాళీ అమ్మవారికి పూజలు నిర్వహించి, స్థానికంగా ఉన్న మసీదులో మొక్కులు చెల్లించుకొని, చర్చిలో ప్రార్థనలు చేసి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు.
- యావత్ ఖైరతాబాద్ గులాబీమయం అయింది. ఎటు చూసినా యువత కేరింతలు, దానం నాగేందర్ జిందాబాద్ నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింద.
- ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది స్వచ్ఛందంగా తరలి వచ్చి ఉత్సాహంగా పాల్గొన్నార న్నారు. ఇదే స్ఫూర్తిని ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగించి కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి గెలిపించి ఖైరతాబాద్‌ను సీఎం కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇస్తామన్నారు.
- ఈ స్పందన చూస్తుంటే నియోజకవర్గం ప్రజలు కారు గుర్తుకు ఓటు వేయాలని నిర్ణయించుకున్నారని కళ్లకు కడుతున్నదన్నారు.





కళాకారుల నృత్యం

ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నామినేషన్



నామినేషన్ దాఖలు చేస్తున్న దానం నాగేందర్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బుధవారం ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా దానం నాగేందర్, స్వతంత్ర అభ్యర్థిగా రంజిత్‌కుమార్, బహుజన్ రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా శంకర్ దాస్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా సుశీల్ లాల్ రాజ్ ప్రసాద్, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫామ్స్ పార్టీ అభ్యర్థిగా వినయ్‌కుమార్, జనతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మహ్మద్ ఖాజా, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా ఏపూరి విక్రమ్ బాబు నామినేషన్లు వేశారు.

అలక వీడిన మాజీ కార్పొరేటర్లు

కొద్ది రోజులుగా ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు దూరంగా ఉన్న మాజీ కార్పొరేటర్లు ఒక్కసారిగా దానం నాగేందర్ నామినేషన్ సందర్భంగా ఆయన బండిలో ప్రత్యక్షమయ్యారు. దీంతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం నెలకొంది. సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్‌తో పాటు, ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ కృష్ణయాదవ్‌తో దానం నాగేందర్ రెండు రోజులుగా జరిపిన చర్చలు ఫలించడంతో వారిద్దరూ నాగేందర్‌కు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో దానం గెలుపునకు పని చేస్తామని కార్యకర్తలకు తెలిపారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రెండు నామినేషన్లు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ నియోజక వర్గంలో బుధవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మజ్లిస్ ఇ మర్కస్ సియాసి(ఎంఎంపీఎస్) పార్టీ తరపున ఎం.మురళీకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీకి చెందిన మురళీకృష్ణ ఈ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తరఫున ఒక సెట్ నామినేషన్ దాఖలైంది. బంజారాహిల్స్ రోడ్ నెం.11లో నివసించే దీపక్‌రెడ్డి తరఫున ఆయన పార్టీ నేతలు ఈ నామినేషన్ దాఖలు చేశారు.

ప్రజలకు అండగా ఉంటా: నవీన్‌యాదవ్



వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజలు దాదాపు పదేళ్లుగా భయం భయంగా కాలం వెళ్లబుచ్చుతున్నారని, అందుల్లే స్థానికంగా ప్రజల మధ్యన ఉండే సరైన నాయకుడి కోసం ఎదురు చూస్తున్నారని ప్రజలకు తాను అండగా ఉంటానని జూబ్లీహిల్స్ స్వతంత్ర అభ్యర్థి వి.నవీన్‌యాదవ్ తెలిపారు. ప్రస్తుత ఎన్నికల్లో ఎంఐఎం అధినేత తనకు టికెట్ ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారని, అయితే ఏమైందో తెలియదుగానీ టికెట్ లభించలేదన్నారు. అందుకే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాని, ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థిగా ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు యూసుఫ్‌గూడ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి షేక్‌పేటలోని రిటర్నింగ్ కార్యాలయంలో తాను నామినేషన్ వేయనున్నట్టు వెల్లడించారు.

నాంపల్లి దర్గాలో మాగంటి ప్రార్థనలు



శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గురువారం నామినేషన్ వేయనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నాంపల్లి దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కులమతాలకు అతీతంగా అందరిని సంఘటితం చేసి అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. కార్పొరేటర్ రాజ్‌కుమార్‌పటేల్, నేలు సంతోష్, తన్నుఖాన్, నజీర్, షకీల్, చోటు, జావేద్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న కళాకృతులు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 69లోని నందగిరిహిల్స్‌లో ఉన్న లేపాక్షి హస్తకళల కేంద్రంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని థిమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు కొనసాగే ఈ ప్రదర్శనలో భాగంగా స్థానిక హస్తకళాకారులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. కనువిందు చేసే ఆకృతులు ఈ ప్రదర్శనలో ఆకట్టుకుంటున్నాయి. పూర్తిగా చేతితో తయారు చేసిన ఆకృతులు ప్రదర్శనలో హైలెట్‌గా నిలుస్తున్నాయి.

రిటైర్డ్ డాక్టర్‌కు సైబర్ నేరగాళ్ల టోకరా

వెంగళరావునగర్: రిటైర్డ్ డాక్టర్‌కు సైబర్‌నేరగాళ్లు తప్పుడు సందేశం పంపి నగదు కాజేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... మధురానగర్‌లో ఉండే సీతాదేవి సీఎస్ ఆర్ఎంఓగా చేసి రిటైర్డ్ అయ్యారు. ఇటీవల ఆమెకు అమెరికాలో ఉండే తన స్నేహితురాలైన డాక్టర్ లక్ష్మీ ఫొటోతో ఉన్న వాట్సాప్ ద్వారా మెసేజ్ వచ్చింది. అర్జంట్‌గా భూపేంద్రసింగ్ అనే వ్యక్తికి నగదు కావాలని పంపమని మెసేజ్‌లో ఉంది. దాంతో లక్ష్మీదేవి రూ. 87 వేలు మెసేజ్‌లో సూచించిన బ్యాంక్ ఖాతాకు పంపింది. ఈ నెల 7న మరో స్నేహితురాలు డాక్టర్ అరుణశ్రీకి కూడా ఇలాంటి మెసేజ్ వచ్చింది. దాంతో ఇరువురు కలిసి డాక్టర్ లక్ష్మీకి ఫోన్ చేసి వివరాలు అడిగారు. తాము ఎవరికీ డబ్బులు పంపమని మెసేజ్ ఇవ్వలేదని చెప్పడంతో బ్యాంక్‌కు వెళ్లి వివరాలు సేకరించగా అది ఫ్రాడ్ అని తేలింది. బాధితురాలు బుధవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్ఎస్‌బీసీ ఆధ్వర్యంలో హెల్పింగ్ హ్యాండ్స్ మేళా



మేళాను ప్రారంభిస్తున్న జీవన్‌లాల్ తదిరులు

సాక్షి, సిటీబ్యూరో: చేతి వృత్తి కళాకారులు, నిరుపేద చేనేత వృత్తి కార్మికులను ఆదుకునేందుకు సామాజిక బాధ్యతగా ప్రముఖ బ్యాంక్ హెచ్ఎస్‌బీసీ ఏటా నిర్వహించే హెల్పింగ్ హ్యాండ్స్ మేళాను బుధవారం ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావిద్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో కె.వి.ఎం.ప్రసాద్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎస్‌బీసీ సోమాజిగూడ శాఖలో జరిగిన కార్యక్రమంలో జీవన్‌లాల్ మాట్లాడుతూ... చేనేతలకు, నిరుద్యోగ యువతకు అండగా నిలవడం కోసం హెచ్ఎస్‌బీసీ చేపట్టిన ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తయారు చేసిన ఉత్పత్తులను తమ బ్యాంక్ కస్టమర్లతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా మేళా నిర్వహిస్తున్నామని కార్యక్రమ పర్యవేక్షకురాలు సౌమ్య తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా తమ బ్యాంకు 14 శాఖలలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. గత 20 సంవత్సరాలనుండి హెల్పింగ్ హ్యాండ్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ ఏడు, చేతి వృత్తుల, చేనేత ఉత్పత్తులకు సంబంధించిన ప్రభుత్వేతర సంస్థల వారిని ఆహ్వానించామన్నారు.

అడ్డంకులను అధిగమిస్తాం.. విజయం సాధిస్తాం

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్



మాట్లాడుతున్న అజహరుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ నేతలకు ఎన్ని అడ్డంకులు సృష్టించినా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. బుధవారం శ్రీనగర్‌కాలనీలోని పార్టీ కార్యాలయం స్థానిక కార్యకర్తలు, నేతలతో రేపు నామినేషన్‌కు సంబంధించి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలు భయంతో బతుకుతున్నారని, వారి విముక్తి కలిగించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మా ప్రచారానికి పోలీసులతో చాలా అడ్డంకులు సృష్టిస్తున్నారని, ఇలాంటివి క్రికెట్‌లో చాలా చూశానని, ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా కలిసికట్టుగా టీం అంతా విజయాలను ఎలా సాధించామో ఇక్కడ కూడా నేతలు, కార్యకర్తల ఆత్మవిశ్వాసంతో తప్పక విజయం సాధిస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు ఉపేందర్‌రెడ్డి, భవానీశంకర్, కిరణ్ యాదవ్, మనోజ్‌యాదవ్, మాజిద్, కుందన్‌యాదవ్, రవిగౌడ్, మోసిన్ ఖురేషి పాల్గొన్నారు.

డబుల్ ఇంజిన్ సర్కారు: బీజేపీ

రహమత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలోనే డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పడబోతున్నదని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బోరబండ డివిజన్ డివిజన్‌లో బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డితో కలిసి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. వినాయకరావునగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోయారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్, నేతలు కుంభాల గంగరాజు, బంగారు పశాంత్, ప్రేమ్, కృష్ణమోహన్, షర్మిల పాల్గొన్నారు.

దానం చేతిలో రూ. 1.50 లక్షలు మాత్రమే!

ఆస్తులు రూ. 41.33 కోట్లు.. అప్పులు రూ. 47.55 కోట్లు

బంజారాహిల్స్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బుధవారం నామినేషన్ దాఖలు చేయగా అఫిడవిట్‌లో తన ఆస్తులను ప్రకటించారు. ఈ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో తన ఆస్తులు, కేసుల వివరాలను వెల్లడించారు. దానం నాగేందర్ పేరిట మొత్తం ఆస్తుల విలువ రూ. 41,33,50,000గా పేర్కొన్నారు. కాగా వివిధ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్‌డిపాజిట్ల రూపంలో 47.63 లక్షలు ఉండగా ఆయన భార్య దానం అనిత పేరు మీద 78.17 లక్షల డిపాజిట్లు ఉన్నాయి. కుమార్తె సాయి ప్రియ పేరిట 9.55 లక్షలు డిపాజిట్లు ఉన్నాయి. ఈక్విటీ షేర్లు, పెట్టుబడుల రూపంలో భాగ్యలక్ష్మి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సంస్థలో రూ. 16.16 కోట్ల విలువైన షేర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎంఎస్‌పీ. ఇండెన్ సంస్థ నుంచి తనకు రూ. 2.74 కోట్లు రావాల్సి ఉందని పేర్కొన్నారు. తనకు వరంగల్ జిల్లా నిరుకులలో 6.09 ఎకరాలు, కళ్ళం గ్రామంలో 18.29 ఎకరాలు, నల్లగొండ జిల్లా పోచంపల్లి గ్రామంలో 9 ఎకరాలు, జనగాం జిల్లా పల్లగుట్ట గ్రామంలో 16 ఎకరాలు, యాదాద్రి భువనగిరి జిల్లా మల్యాల గ్రామంలో 4.11 ఎకరాలు ఉన్నట్లు వెల్లడించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 3లోని 1432 గజాల్లో ఇల్లు ఉందని దాని ప్రస్తుత మార్కెట్ విలువ రూ. 25 కోట్ల వరకు ఉంటుందని పేర్కొన్నారు. తనకు రూ. 47.55 కోట్ల అప్పులు ఉన్నాయని పేర్కొన్నారు. భార్య పేరిట రూ. 2 కోట్ల అప్పు ఉందని కాగా తన చేతిలో రూ. 1.50 లక్షల నగదు మాత్రమే ఉందని అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం.

ఆభరణాల విలువ రూ. 27కోట్లు

దానం నాగేందర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యుల పేరిట రూ. 27 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాలు ఉన్నట్లుగా అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వీటిలో దానం పేరిట 1297 క్యారెట్ల వజ్రాలు(రూ.2.99 కోట్లు), 80 తులాల బంగారం(21.6లక్షలు), పది కేజీల వెండి(రూ.4.4 లక్షలు) ఉండగా ఆయన భార్య అనితకు 1350 క్యారెట్ల వజ్రాభరణాలు(3.39కోట్లు), 225 తులాల బంగారం(60.75లక్షలు) ఉన్నాయి. రూ. 10.82 లక్షల విలువైన ఆభరణాలు ఉన్నట్లు పేర్కొన్నారు.

‘చెయ్యి’తోనే సమాధానం చెప్తాం

- ఓటర్లను భయపెడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం
- ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయారెడ్డి



ఖైరతాబాద్‌లో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

ఖైరతాబాద్: తనపై అభిమానంతో, తన తండ్రిపై అభిమానంతో ఎంతో మంది కాంగ్రెస్ వైపు వస్తుందే కొంత మంది వారిని బెదిరిస్తున్నారని, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అలాంటి వారికి సరైన త్వరలోనే సమాధాన చెబుతామని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి. విజయారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయారెడ్డి ఖైరతాబాద్‌లో ఆమె గడప గడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదరించేది చెయ్యి... అక్కున చేర్చుకునేది చెయ్యి... కోపం తెప్పిస్తే అదే చెయ్యి సమాధానం కూడా చెబుతుందంటూ ప్రత్యర్థి పార్టీలపై ఆమె ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తిరుగుతూ వివరించారు. స్థానిక నేతలు విశేష్, ఫతూ, ఉదయ్, శ్రీకాంత్, క్రాంతి బ్రదర్స్, సందీప్ ఆధ్వర్యంలో ఆమె భారీ ర్యాలీని నిర్వహించారు. తమ ప్రచారానికి ఎక్కడ చూసినా అనూహ్య స్పందన లభిస్తున్నదని.. తన ఎన్నికల్లో భారీ మెజార్టీతో తాను గెలవడం ఖాయమని విజయారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

పీజేఆర్ బిడ్డగా ప్రజాదరణ

పంజగుట్ట: తమకు ఓటు వెయ్యకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డబుల్ బెడ్ రూంలు రావని ఖైరతాబాద్ ఎమ్మెల్యే ఓటర్లను భయపెట్టిస్తున్నాడని ఆయన బెదిరింపులకు ఎవరూ భయపడరాదని అందరికీ తాను, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రేమ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ మీటింగ్‌లో ఆమె ప్రజలనుద్దేశిస్తూ మాట్లాడుతూ... ప్రస్తుత ఎమ్మెల్యే తాను ఓడిపోతున్నానని ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుందని గ్రహించి ఇక భయపెట్టే కార్యక్రమాలు చేస్తున్నాడన్నారు. అతిత్వరలో మన ప్రభుత్వం వస్తుందని సంక్షేమ పథకాలు ఇప్పటికన్నా ఇంకా బాగా కొనసాగుతాయని తెలిపారు. చేసిన అభివృద్ధి చెప్పి ఓట్లు అడగాలి కాని భయపెట్టి కాదని ఆమె పేర్కొన్నారు. బస్తీల్లో వెలుతుంటే ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని ఎక్కడచూసినా పీజేఆర్ బిడ్డగా అక్కున చేర్చుకుంటున్నారన్నారు. ఎన్నికల్లో తాను తప్పక విజయం సాధించి ప్రజల రుణం తీర్చుకుంటానని విజయారెడ్డి తెలిపారు.



ప్రేమ్‌నగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విజయారెడ్డి



ఖైరతాబాద్‌లో మహిళలతో మాట్లాడుతూ...

నిమ్స్‌కు త్వరలో డీఎస్‌ఏ యంత్రం

- ప్రతి విభాగానికీ రెండేసి సీటీ స్కాన్, ఎంఆర్‌ఐలు, మామోగ్రఫీ యంత్రాలు
- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప



లక్డీకాపూల్: నిమ్స్‌లో డిజిటల్ సబ్‌స్ట్రాక్షన్ యాంజోగ్రాఫీ (డీఎస్‌ఏ) యంత్రాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ నగర బీరప్ప తెలిపారు. ప్రభుత్వ చేయూతతో సంస్థతో ఇప్పటికే స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఎక్విప్మెంట్‌ని సమకూర్చుకున్నట్టు తెలిపారు. బుధవారం నిమ్స్‌లో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రామా సెంటర్ నుంచి మెయిన్ గేట్ వరకు రేడియేషన్ సేఫ్టీ అవేర్‌నెస్ వాక్ ని నిర్వహించారు. వాక్‌లో నిమ్స్ నర్సింగ్, ఫిజియోథెరపీ, వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నిమ్స్ లెర్నింగ్ సెంటర్ లో జరిగిన అవగాహనా కార్యక్రమంలో డైరెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిమ్స్ రేడియాలజీ విభాగం అన్ని హంగులతో, అధునాతన పరికరాలతో రోగ నిర్ధారణకు పెట్టింది పేరు అని ప్రశంసించారు. డీన్ ప్రొఫెసర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, రేడియాలజీ డిపార్ట్మెంట్ హెచ్ఓడి డాక్టర్ అనుకపూర్, నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్, రేడియేషన్ సేఫ్టీ అధికారి శిరందాస్ శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంత్ వీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని ప్రకటనతో బీసీల్లో పెరిగిన ఆత్మగౌరవం

- సీఎం చాన్స్‌ను బీసీలు సద్వినియోగం చేసుకోవాలి
- బీసీ, కుల సంఘాల ప్రతినిధులు

పంజగుట్ట: తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే బీసీ వర్గానికి చెందిన వారినే ముఖ్యమంత్రిగా చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రకటించడంతో బీసీల ఆత్మగౌరవం పెరిగిందని పలు బీసీ, కుల సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బోయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మీన గోపి బోయ, బీసీ శక్తి రాష్ట్ర అధ్యక్షుడు పిట్ల నగేష్ ముదిరాజ్, బీసీ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ యాదవ్, డీఎస్‌టీ సంఘం అధ్యక్షుడు చిత్తరంజన్‌లు మాట్లాడుతూ... బీజేపీ ఓబీసీ మహాసభలో ప్రధాని మోడీ బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించం ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు. సమావేశం ముగిసిన అనంతరం బీసీ కుల సంఘాల నాయకులతో ఈటలకు జీతావో సీఎం బనావో అన్నారని దాన్ని మరింత స్వాగతిస్తున్నట్లు వారు తెలిపారు. ఈటల బీసీలోని అన్ని కులాలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అందరి సమస్యలు తెలిసిన నాయకుడని వారు పేర్కొన్నారు. ఏకులానికి ఇచ్చినా స్వాగతిస్తామని బీసీలకు ఒక అవకాశం వచ్చిందని దాన్ని బీసీలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బోరబండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా విజయ్



రహమత్‌నగర్: బోరబండ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓగా ఎస్.విజయ్ బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న కామల్ల రవికుమార్‌ను నగర పోలీస్ కమిషనర్ బదిలీ చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి డీఐ భూపాల్‌గౌడ్ ఎస్‌హెచ్ఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కామాటిపురా పీఎస్‌లో డీఐ(ఎస్‌బీ అటాచ్) విధులు నిర్వహిస్తున్న ఎస్.విజయ్‌ను బోరబండ ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ మంగళవారం కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎగుమతులు లక్ష్యంగా ‘వాల్‌మార్ట్’ గ్రోత్ సమ్మిట్

లక్డీకాపూల్: వస్తువుల ఎగుమతులు పెంచడమే లక్ష్యంగా వాల్‌మార్ట్ గ్రోత్ సమ్మిట్‌ను నిర్వహించనున్నట్టు సోర్సింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆండ్రియా ఆల్‌బ్రైట్ తెలిపారు. గ్లోబల్ మార్కెట్లో ప్రముఖ భాగస్వామిగా సప్లయ్ చైన్ అభివృద్ధి చేయాలనే భారతదేశ ఆశయానికి ఈ ఈవెంట్ మరింత మెరుగుపరుస్తుందన్నారు. బుధవారం ఈ మేరకు సోమాజిగూడలోని వాల్‌మార్ట్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ వచ్చే ఏడాది ఫిబ్రవరి14, 15వ తేదీల్లో జరిగే ఈ సమ్మిట్‌కు అమ్మకందారులు, సప్లయ్ చైన్ నిపుణులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచిస్తూ.. గురువారం నుంచి వచ్చే నెల11వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఈవెంట్‌లో ఎగుమతి చేయడానికి సిద్ధంగా ఉన్న సరఫరాదారులు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు), వాణిజ్య సరఫరాదారులు, సప్లయ్ చైన్ కంపెనీలు వ్యాపారం చేయడానికి అవకాశం ఉందన్నారు. వాల్‌మార్ట్ సరఫరాదారు, బెక్టర్స్ ఫుడ్ స్పెషాలిటీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ బెక్టర్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయిలో ప్రదర్శించడానికి వనరులు, అవకాశాలను అందించిందన్నారు.

25న చిచ్చా కా ఆస్ట్రేలియా టూర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాహుల్ సిప్లిగంజ్

బంజారాహిల్స్: ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఈ నెల 25న ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ టింబర్ యార్డ్‌లో నిర్వహించనున్న చిచ్చా కా ఆస్ట్రేలియా టూర్ పోస్టర్‌ను బుధవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 10లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి రాహుల్ సిప్లిగంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఇదొక మర్చిపోలేని మ్యూజికల్ జర్నీగా మిగులుతుందని వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇదే మొదటిసారి అని అన్నారు. స్థానికంగా అభిమానులను కలుసుకునేందుకు ఇదొక వేదిక కాబోతున్నదని వెల్లడించారు.

రౌడీ షీటర్ల తల్లిదండ్రులకు డీసీపీ కౌన్సిలింగ్

రహమత్‌నగర్: బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల తల్లింద్రులకు నార్కోటిక్ విభాగం డీసీపీ సునితారెడ్డి మంగళవారం కౌన్సిలింగ్ ఇచ్చారు. ఉదయం నుంచి రౌడీషీటర్ల నివాసాలకు వెళ్లి వారి తండ్రిదండ్రులతో మాట్లాడారు. బైండోవర్ అయిన రౌడీషీటర్లు బెదిరింపులు, ఘర్షణలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు ఉంటాయని వారి తల్లిదండ్రులకు సూచించారు. సెక్టార్ ఎస్ఐ స్వప్నారెడ్డితో పాటు మహిళా పోలీసులు పాల్గొన్నారు.